

రేపు లాంఫాం శతాబ్ది ఉత్సవాలు


గుంటూరు రూరల్: లాంఫాం వంద సంవత్స రాల వేడుకలను శుక్రవారం నిర్వహించను న్నట్లు లాంఫాం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.సుబ్బారావు తెలిపారు.



దర్గా ఆదాయం రూ.19.06లక్షలు

పెదకాకాని: బాజీబాబా దర్గా హుండీ ఆదాయం ఐదు నెలల కాలానికి రూ.19,06,195 లభిం చిందని దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా తెలిపా రు. మంగళ, బుధవారాల్లో లెక్కింపు జరిగింది.

రెంటచింతల @ 41.8 డిగ్రీలు



రెంటచింతల: రెంటచింతలలో బుధవారం గరిష్ట ఉష్ణోగ్రత 41.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27.4 డిగ్రీలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికా రులు తెలిపారు. మూడు రోజులుగా 41 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో గ్రామ స్థులు అల్లాడుతున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
నరసరావుపేట	6:27	4:46
గుంటూరు	6:25	4:47
బాపట్ల	6:25	4:47

న్యూస్‌రీల్


గంజాయి నివారణకు పటిష్ట చర్యలు

జూమ్ ద్వారా గుంటూరు, బాపట్ల, ప్రకాశం ఎస్పీలతో మాట్లాడిన గుంటూరు ఐజీ



నగరంపాలెం: గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని ఎన్‌డీపీఎస్, నాటుసారా, బెల్లం ఊట కేసుల్లో పదే పదే నేరాలు చేస్తూ పట్టుబడిన వారిని గుర్తించి, వారిపై పీడీ చట్టం నమోదుకు ప్రతిపాదనలు పంపించాలని గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమవర్మ ఆదేశించారు. గుంటూరు నగరంలోని రేంజ్ కార్యాలయం నుంచి బుధవారం గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ గంజాయి నివారణకు ప్రతి జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా గంజాయి క్రయ విక్రయాలతోపాటు తాగే వారిని కూడా నియంత్రించాలని ఆదేశించారు. గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్, ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికగార్గ్, మూడు జిల్లాల డీఎస్పీలు హాజరయ్యారు.

నాగార్జునకొండను సందర్శించిన శ్రీలంక బౌద్ధులు



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను బుధవారం 32 మంది శ్రీలంక బౌద్ధమతస్తుల బృందం సందర్శించింది. స్థానిక లాంచీస్టేషన్ నుంచి నాగసిరి లాంచీలో నాగార్జునకొండకు వెళ్లిన శ్రీలంకేయులు నాగార్జునకొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధుని ప్రతిమలు, మట్టి కుండలు, రాతి పనిముట్లు, 9 అడుగుల బుద్ధుడి పాలరాతి విగ్రహం, అశ్వమేధ యాగశాల, మహాస్థూపం, స్నానాల గట్టును తిలకించారు. నాగార్జున కొండను సందర్శించడం ఆనందంగా ఉందని బౌద్ధులు తెలిపారు.

1,20,059 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,15,161 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,20,059 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,200 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 82,824 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.5,200, మోడల్ ధర రూ.4, 400 వరకు పలికింది.

కళల వేడుకకు వేళాయె

- రేపటి నుంచి పుచ్చలపల్లి సుందరయ్య స్మారకోత్సవాలు
- మార్చి 31, ఏప్రిల్ 1, 2వ తేదీల్లో జాతీయ స్థాయి నాటికల పోటీలు



ఇళ్లకు వెళ్లి నాటిక పోటీల ఆహ్వాన పత్రికలు అందిస్తున్న కళాకారులు

యడ్లపాడు: 'కళ' ప్రజల కోసం.. ప్రగతి కోసం. గత రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న కళల వేడుకలకు వేళ అయింది. రంగస్థల ఉత్సవాలకు రంగం సిద్ధమైంది. పల్నాడు జిల్లా (ఉమ్మడి గుంటూరు జిల్లా)లోని యడ్లపాడులో పుచ్చలపల్లి సుందరయ్య కళావేదిక ఇందుకు వేదికగా నిలుస్తుంది. ఒకప్పుడు కేవలం ఆహ్వాన నాటికల నిర్వహణకు మాత్రమే పరిమితమైన ఈ కళావేడుకలు, గత ఏడాది నుంచి జాతీయ స్థాయి నాటికల పోటీలుగా కొత్త రంగు హంగు దాల్చుకుంది. నానాటికీ అంతరిస్తున్న తెలుగు నాటక రంగానికి తిరిగి ఊపిరి పోస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా జవసత్వాలు అందివ్వాలన్నదే వీటి నిర్వహణ వెనుక ప్రధాన ఉద్దేశమని ప్రస్ఫుటమవుతోంది. ప్రపంచ దేశాలు గర్వించదగ్గ ఆదర్శ నేత 'పుచ్చలపల్లి సుందరయ్య' పేరిట నెలకొల్పిన తొలి కళా సంస్థ ఇది. కరోనా లాక్‌డౌన్‌లో మినహా క్రమం తప్పకుండా నాటికల పోటీలను నిర్వహిస్తూ ఏటా అటు కమ్యూనిస్టులు, ఇటు కళాభిమానుల ప్రశంసల పరంపరను అందుకుంటోంది. కళామతల్లి సేవలో ఈ ఏడాది 20వ వార్షికోత్సవంలోకి అడుగిడుతోంది. ఈ బృహత్తర లక్ష్యాన్ని విజయవంతం చేసేందుకు నాటకోత్సవ కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విభిన్న తరహా కళా రూపాల ఎంపికే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఎందరో ప్రముఖ, వర్ధమాన రంగస్థల కళాకారులతో ఈ ప్రాంతం కోలాహలంగా మారనుంది. శోభాకృత్ నామ సంవత్సరంలో జరుపుకునే తొలి పండుగ శ్రీరామ నవమి మరుసటి రోజే తెలుగు సాంఘిక కళా సౌరభాలు విరాజిల్లనున్నాయి. మార్చి 31, ఏప్రిల్ ఒకటి, రెండో తేదీల్లో మూడ్రోజుల పాటు పది అద్భుత కళారూపాలు ప్రేక్షకులను కనువిందు చేయనున్నాయి.

ప్రదర్శనల్లో విశిష్టత..

కళాసంస్థలేవీ చేపట్టని విధంగా జాతీయ స్థాయికి తగ్గట్టుగానే ప్రదర్శనలు, నిర్వహణ అంతా విభిన్నం, వినూత్నంగా ఉండటంతో పాటు, నిర్వహణ పరంగా అట్టహాసం, ఆకట్టుకునేలా ఉంటాయని నిర్వాహకులు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. ఆధునిక టెక్నాలజీ ఉపయోగించుకుని లైటింగ్ ఎఫెక్ట్స్, స్టేజ్ డెకరేషన్‌తో ప్రదర్శనలు వేటికవే పోటీపడుతూ ప్రత్యేకతను చాటుకుంటాయన్నారు.



సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదిక

పేరంటాళ్ల 'మాదిరి' ఆహ్వానాలు..

కళాపోషకులు, అతిథులు, దాతలతో పాటు గ్రామంలోని ప్రతి ఇంటికి నిర్వహణ కమిటీ సభ్యులు వెళ్లి గడపకు ఆహ్వాన పత్రిక, ఎంట్రీ కూపన్లు ఇచ్చి సాదరంగా ఆహ్వానిస్తారు. నాటిక ప్రదర్శన ముగిసిన వెంటనే ఆ ప్రదర్శనకు హాజరైన ప్రేక్షకుల నుంచి కూపన్లను లక్కీడ్రా ద్వారా మూడు రోజులు 30 మంది విజేతలకు ప్రత్యేక బహుమతులు వేదికపైనే అందిస్తారు.

వీధుల నుంచి వేదిక వరకు కళాజాతరే..

ఈ ఉత్సవాలకు 200 మంది కళాకారులు, తెలంగాణ, ఆంధ్రాకు చెందిన 100 మంది ప్రజా నాట్యమండలి కళాకారులు హాజరు కానున్నారు. ఆయా బృందాలు ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు గ్రామంలోని వీధుల్లో కళా జాతలు ప్రదర్శన చేయనున్నారు. కోలాటాలు, సామాజిక చైతన్యాన్ని తెచ్చే వీధి నాటికలతో అలరించనున్నారు.

ప్రధాన న్యాయనిర్ణేతలు ముగ్గురితో పాటు మరో 12 మంది..

ఉత్తమ ప్రదర్శన, నటీనటులు, సాంకేతిక విభాగాల కళాకారులకు అందించే బహుమతుల విషయంలో ఎలాంటి పక్షపాత ధోరణి లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ఓ చక్కని నిర్ణయం తీసుకోవడం విశేషం. వైద్య, న్యాయ, జర్నలిజం, సాహిత్య, రంగస్థల రంగాల్లోని ప్రముఖులు ప్రేక్షక న్యాయనిర్ణేతలుగా ఉండబోతున్నారు. వీరందరి తుదితీర్పుతోనే బహుమతులు అందజేస్తారు. నాటక రంగంలోనే కొత్త కోణంగా పరిగణించవచ్చు.

పారితోషికాల పంపిణీలోనూ ప్రత్యేకమే..

పోటీల్లో ఉత్తమ ప్రదర్శనలుగా నిలిచిన మూడింటికి వరుసగా రూ.25 వేలు, రూ.22,500, రూ.20 వేలు చొప్పున బహుమతులు, జ్ఞాపికలు ఇస్తారు. ప్రదర్శితమైన ప్రతి నాటికకు రూ.15 వేల నగదు. స్త్రీవాద రచయిత్రి (యడ్లపాడు ఆడపడుచు) ఓల్గా అవార్డ్ కింద నాటిక రచయిత, దర్శకుడికి రూ.1,116, ఉత్తమ నాటిక, రచయిత, దర్శకులకు విడివిడిగా రూ.1,116, ఐదుగురు ఉత్తమ నటీనటులకు ఒక్కొక్కరికీ రూ.1,116, మరో ఐదుగురు ఉత్తమ సహాయ నటులకు రూ.516, ఉత్తమ ఆహార్యం, రంగాలంకరణ, సంగీత విభాగాలకు రూ.1,116 నగదు, జ్ఞాపికలు ఇవ్వనున్నారు. ఆయా ప్రదర్శనలో నటించిన ప్రతి కళాకారిణికి ఆడపడుచు లాంఛనలతో అపూర్వ సత్కారం అందించనున్నారు. వీటితో పాటు పోటీల ప్రారంభోత్సవాలకు హాజరయ్యే విశిష్ట అతిథి, సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజకు సుందరయ్య గౌరవ పురస్కారంతో సత్కరించనున్నారు. మూడ్రోజులు పసందైన ఇంటి వంటకాలతో అతిథులకు ఆతిథ్యం ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యులు ముత్తవరపు సురేష్‌బాబు, నూతలపాటి కాళిదాసు, ముత్తవరపు పద్మారావు, జరుగుల శంకరరావు వెల్లడించారు.

కలెక్టర్స్ క్రికెట్ ట్రోఫీ విజేత సత్తెనపల్లి



కలెక్టర్స్ క్రికెట్ ట్రోఫీ విజేత సత్తెనపల్లి జట్టు



రన్నరప్ నరసరావుపేట జట్టు

నరసరావుపేట ఈస్ట్: కలెక్టర్స్ క్రికెట్ ట్రోఫీ విజేతగా సత్తెనపల్లి నియోజకవర్గం నిలిచింది. పల్నాడు జిల్లా ఏర్పడి ఏడాది పూర్తికావస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు డీఎస్‌ఏ స్టేడియంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌ను జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం టాస్ వేసి ప్రారంభించారు. టాస్ గెలిచిన సత్తెనపల్లి జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన నరసరావుపేట జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 62 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సత్తెనపల్లి జట్టు 7.3 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 64 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. నరసరావుపేట జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. విజేతలకు ఏప్రిల్ 4వ తేదీ నిర్వహించనున్న పల్నాడు జిల్లా అవతరణ దినోత్సవంలో బహుమతులు అందించనున్నట్లు రెవెన్యూ అధికారి వినాయకం తెలిపారు. క్రీడాకారులను డ్వామా పీడీ జి.జోసఫ్, స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి, చీఫ్ కోచ్ బావలి శ్రీనివాసరావు అభినందించారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డీఈఓ శామ్యూల్

నరసరావుపేటఈస్ట్: పల్నాడు జిల్లా ఏర్పడిన తరువాత తొలిసారిగా జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ తెలిపారు. నరసరావుపేట విద్యాడివిజన్ పరిధిలోని 71 రెగ్యులర్ పరీక్షా కేంద్రాలతో పాటు, సార్వత్రిక విద్యాపీఠానికి సంబంధించి ఏడు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు బుధవారం శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్ మాట్లాడుతూ, విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్, వైద్యశాఖ, ఆర్టీసీ తదితర అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పదో తరగతి పరీక్షలను విజయవంతం చేయాలని కోరారు. పరీక్షా కేంద్రాల్లో సీఎస్, డీఓలతో సహా ఎవరికీ సెల్‌ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్ష జరిగే ప్రతి రోజు సెట్ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు అందించటం జరుగుతుందన్నారు. పరీక్షల్లో కాపీయింగ్ ప్రోత్సహించరాదని, నిష్పక్షపాతంగా, నిజాయితీతో పరీక్షలు జరపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కేఎంఏ హుస్సేన్, మండల విద్యాశాఖాధికారులు జ్యోతికిరణ్, కేపీ బాబురెడ్డి, ఎం.నాగయ్య, అల్లి సురేష్, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏఏ మధుకుమార్, ప్రధానోపాధ్యాయులు బీవీఏఎల్ వరప్రసాద్, బీఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్

దళితులపై దాడుల పేరుతో రామోజీ అసత్య ప్రచారం

- మంత్రి మేరుగ నాగార్జున
- చంద్రబాబు హయాంలో దళితులపై లెక్కలేనన్ని దాడులు
- దళితుల భూములు లాక్కున్న రామోజీ..
- మార్గదర్శి పేరుతో ప్రజల సొమ్ము కాజేసిన వైనం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో సాంఘిక సంక్షేమ శాఖలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి సాధిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వినుకొండలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా నాడు– నేడు పథకంలో ఎస్సీ హాస్టల్ భవనాలను సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఫేజ్ 1, 2, 3లలో రెసిడెన్షియల్ స్కూల్స్ కూడా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు హయాంలో దశలవారీగా ఎస్సీ హాస్టల్ భవనాలు మూత పడినట్లు పేర్కొన్నారు. ఎస్సీ గురుకులాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పి చంద్రబాబు హాస్టల్ భవనాలు మూసి వేశారన్నారు.

దళితులపై దాడుల పేరుతో రామోజీ అసత్య ప్రచారాలు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు జరుగుతున్నాయని, దళితులకు రక్షణ లేదని ఈనాడు రామోజీరావు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. 14 ఏళ్ల చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు జరిగాయని తెలిపారు. అమలాపురం, విశాఖ, తిరుపతి, కుప్పం, కర్నూలు జిల్లాల్లో లెక్కలేనని దాడులు జరిగాయన్నారు. అప్పట్లో ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా ఉన్న తనకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఘటనలపై అవగాహన ఉందన్నారు. అప్పుడు రామోజీ ఎందుకు వార్తలు రాయలేదని ప్రశ్నించారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో దళితుల భూములు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. మార్గదర్శి పేరుతో ప్రజల సొమ్ముకు లెక్కలు చూపకుండా కాజేశారన్నారు. తమ ప్రభుత్వం జరిగిన దాడులపై వెంటనే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చంద్రబాబు హయాంలో దళితుల సంక్షేమానికి రూ.36 వేల కోట్లు ఖర్చు చేస్తే తమ ప్రభుత్వం కేవలం మూడున్నరేళ్లలో రూ.51 వేల కోట్లు నేరుగా పేదవారికి అందించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి రెక్కల కష్టంతో గెలిచిన ఎమ్మెల్యేలు కొందరు పార్టీకి ద్రోహం చేశారని, వారికి రాజకీయ భవిష్యత్తు లేదన్నారు. 40 మంది ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని చెబుతున్న అచ్చెన్నాయుడు కూడా టీడీపీని నమ్మే స్థితిలో లేరన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



పసుమర్రు లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేటలోని పసుమర్రు వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ ఉన్నతాధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. థర్డ్ ఆప్షన్ కింద నిర్మిస్తున్న నిర్మాణాల పరిస్థితి ఏమిటని హౌసింగ్ అధికారులను ప్రశ్నించారు. దీనికి వారు సమాధానం చెబుతూ థర్డ్ ఆప్షన్ కింద 1376 గృహాలు వివిధ దశల్లో నిర్మాణం జరుపుకుంటున్నాయని తెలిపారు. థర్డ్ ఆప్షన్ గృహాలు ఎప్పటిలోగా పూర్తి చేస్తారని మంత్రి, కేఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధిని ప్రశ్నించగా ఆరు నెలల్లోగా పూర్తి చేస్తామని సమాధానమిచ్చారు. లేఅవుట్‌లో మొత్తం ఇళ్ల నిర్మాణాల పరిస్థితి ఏమిటని గృహ నిర్మాణ అధికారులను ప్రశ్నించారు. అర్బన్‌కు సంబంధించి మొత్తం 3,022 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పసుమర్రు లేఅవుట్‌లో రికార్డు స్థాయిలో 7,865 మందికి గృహాలు నిర్మించి ఇవ్వాల్సిన బృహత్తర కార్యక్రమం మనందరిపై ఉందని చెప్పారు. దీనికోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాల్సిఉంటుందన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తిచేసేందుకు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లులేని నిరుపేదలందరికీ ఇళ్ల నిర్మాణాలు చేయించి ఇచ్చే విషయంలో ఎంతో ఆసక్తి కలిగిఉన్నారని, సీఎం ఆశయాల మేరకు అధికారులు నడుచుకోవాలని పేర్కొన్నారు. పసుమర్రు లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే ఒక కొత్త ఊరు వెలుస్తుందని వెల్లడించారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందజేస్తోందని చెప్పారు. స్వయం సహాయ సంఘాల సభ్యులకు అదనంగా రూ.35 వేలు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని చెప్పారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎస్.వేణుగోపాలరావు, ఈఈ బి.శివలింగం, డీఈఈ ఎస్.వెంకట్రావు, పబ్లిక్ హెల్త్ డీఈఈ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, 16వ వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన గ్రామ సర్వేయర్

రైతు నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

కర్లపాలెం: భూమి సర్వే రిపోర్టు ఇచ్చేందుకు ఓ గ్రామ సర్వేయర్ రైతు వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ టీవీవీ ప్రతాప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... దుండివారిపాలెం సచివాలయ గ్రామ సర్వేయర్‌గా కె.సీతాహేమంత్ పనిచేస్తున్నాడు. ఇతను యాజలి గ్రామ ఇన్‌చార్జి సర్వేయర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన వెంకయ్యకు కర్లపాలెం మండలం యాజలి రెవెన్యూ పరిధిలో వ్యవసాయ భూములు ఉన్నాయి. వెంకయ్య ఈనెల 21వ తేదీన తమ భూమి సర్వేచేసి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా గ్రామ సర్వేయర్ సీతా హేమంత్ ఈనెల 24వ తేదీన సదరు భూమికి సర్వే నిర్వహించారు. అయితే సర్వే ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు సీతాహేమంత్ వెంకయ్యను రూ.26వేలు లంచం డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వటం ఇష్టంలేని వెంకయ్య ఏసీబీ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు బుధవారం దుండివారిపాలెం గ్రామ సచివాలయంలో ఉన్న సర్వేయర్ సీతాహేమంత్‌కు రూ.26వేలు నగదు లంచంగా ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈసందర్భంగా ఏసీబీ డీఎస్పీ టీవీవీ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే తమకు కాని, 14400 యాప్ ద్వారా కాని, స్పందన కాల్ సెంటర్‌కు కాని ఫోన్‌చేసి ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సబ్ ఇన్‌స్పెక్టర్లు రవిబాబు, నాగరాజు, అంజిబాబు, మన్మథరావు, ఎస్‌ఐ శ్రీనివాసమూర్తి ఉన్నారు.



నగదుతో గ్రామ సర్వేయర్ సీతాహేమంత్

4న 'పల్నాడు' తొలి వార్షికోత్సవం

- ఘనంగా వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు
- కలెక్టర్స్ ట్రోఫీ పేరిట పలు క్రీడా పోటీల నిర్వహణ
- అందరూ భాగస్వాములుకావాలని కలెక్టర్ శివశంకర్ ఆహ్వానం

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా ఏర్పడి ఏప్రిల్ 4వ తేదీకి ఏడాది పూర్తి కానున్న సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దశాబ్దాలుగా పల్నాడు ప్రజలు కోరుకున్న ప్రత్యేక జిల్లా ఏర్పడటంతో పాటు ఈ ఏడాదిలో ఎన్నో మార్పులు సంభవించాయన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటు వల్ల ప్రజలకు ఏ విధంగా మేలు జరిగిందో గుర్తు చేసుకుంటూ వేడుకలు నిర్వహించాలనుకొంటున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు సామాన్య ప్రజలు మొదలు జిల్లా మంత్రుల వరకు ఇదే మా ఆహ్వానమని కలెక్టర్ తెలిపారు. అందరూ ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తొలి వార్షికోత్సవం సందర్భంగా నరసరావుపేట కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికే కలెక్టర్స్ ట్రోఫీ పేరిట ప్రభుత్వ ఉద్యోగులు, యువతకు క్రికెట్, త్రోబాల్, షటిల్, చదరంగం, సింగింగ్, మ్యూజిక్, క్విజ్ మొదలగు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు ఏప్రిల్ 4న బహుమతులు అందజేయనున్నామని తెలిపారు. చిహ్నం, కలెక్టరేట్ కొత్త ప్రవేశ మార్గాన్ని ఆ రోజు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నవోదయంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు వాహనాలను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేస్తామన్నారు. పల్నాడు లోగోను ఆవిష్కరించనున్నామని తెలిపారు. ఈ ఏడాది కాలంలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ప్రభుత్వ కార్యాలయాలకు అవార్డులు అందజేస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

పదో తరగతి ప్రశ్నపత్రాలకు సీరియల్ నంబర్లు కేటాయింపు

నరసరావుపేట: పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం తొలిసారిగా ప్రశ్నపత్రాలకు సీరియల్ నంబర్లను కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వెల్లడించారు. బుధవారం పదవ తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై విశాఖపట్నం కలెక్టరేట్ నుంచి విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకున్నట్లు, చేసిన ఏర్పాట్లు, పరీక్షా కేంద్రాల వివరాలను జిల్లా కలెక్టర్ వారికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి పరీక్షలను ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 127 పరీక్షా కేంద్రాల్లో 24,354 మంది విద్యార్థినీ, విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను రాయనున్నారని తెలిపారు. గతంలో ఏడు ప్రశ్నాపత్రాలు ఉండగా వాటిని ఆరుకు తగ్గించినట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, డీఈఓ ఐ.శామ్యూల్ పాల్గొన్నారు.

ప్రజలకు మంత్రులు రజిని, అంబటి శ్రీరామనవమి శుభాకాంక్షలు




సత్తెనపల్లి: ప్రజలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. సీతారాముల దీవెనలతో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, ప్రతి ఇంటా శ్రీరామ నవమి పర్వదినాన్ని, రాములవారి కల్యాణాన్ని వేడుకగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సీతారాముల అనుగ్రహం పొందాలన్నారు.


మెగా టూరిజం భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న పర్యాటక, రెవెన్యూశాఖ అధికారులు

విజయపురిసౌత్: ఇటీవల నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లో భూ ఆక్రమణలు ఎక్కువ కావడంతో మెగా టూరిజం కోసం ఇచ్చిన భూములను రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులు కలిసి బుధవారం పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మెగా టూరిజం కోసం ఇచ్చిన 250 ఎకరాల భూములకు కంచె ఏర్పాటు చేసుకోవాలని పర్యాటక శాఖ నిర్ణయించింది. దీంతో రెవెన్యూ అధికారులను కలిసి 250 ఎకరాలకు సంబంధించిన హద్దులను సూచించాలని కోరారు. మాచర్ల మండల ఆర్ఐ ఫణీంద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం మెగా టూరిజం భూములను పరిశీలించి, నివేదికను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం మేనేజర్ శ్రీనివాస్, మండల సర్వేయర్ పవన్ శర్మ, వీఆర్‌వోలు శ్రీను, విఘ్నేష్, టూరిజం ఉద్యోగులు వీరారెడ్డి, దత్తు తదితరులు పాల్గొన్నారు.

రఘు'రామయ్య నాణేల' ప్రదర్శన



ఆదిపూడి (కారంచేడు): శ్రీరామ నవమి సందర్భంగా ఆదిపూడికి చెందిన కాల్వ రఘురామయ్య సీతారాముల పట్టాభిషేకం నాణేలను ప్రదర్శించారు. బుధవారం వాటిని చూసేందుకు యువత, పిల్లలు, పెద్దలు తరలివచ్చారు. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో 1818లో దేశంలో సీతారాముల బొమ్మలతో ఉన్న అర్ధణ, అణ నాణేలు వాడుకలో ఉండేవని రఘురామయ్య తెలిపారు. చిన్నతనం నుంచి పురాతన నాణేలను సేకరించడం అలవాటుగా ఉన్న రఘురామయ్య ఢిల్లీ, హర్యానా, హైదరాబాద్, ముంబై వెళ్లినప్పుడు వీటిని సేకరించానని తెలిపారు.

ఆరు నెలల్లోపు హైవే పనులు పూర్తి చేయండి

హైవే నిర్మాణ పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ పీఆర్కే



మాచర్ల-దాచేపల్లి నేషనల్ హైవే పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: సాగర్ నుంచి దాచేపల్లికి రూ.330 కోట్లతో చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం మాచర్ల నుంచి దాచేపల్లి వరకు జరిగే హైవే నిర్మాణ పనులను హైవే, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ ఆరు నెలల్లోపు జాతీయ రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. 26 కి.మీ.ల హైవే నిర్మాణ పనులకు సంబంధించి ఏ విధంగా పనులు జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. మాచర్ల, రెంటచింతల, గురజాల, దాచేపల్లి ప్రాంతాల్లో హైవే నిర్మాణంతో నష్టపోయిన రైతులకు పరిహారం త్వరితగతిన అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్వాసిత రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా పీఆర్కే విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రోడ్లను అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. అందులో భాగంగా మాచర్ల నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి వందలాది కోట్లు కేటాయించి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నేషనల్ అథారిటీ అధికారులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మాచర్ల పట్టణంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో గంగలకుంట గ్రామానికి చెందిన మేడబోయిన పిచ్చయ్య, శ్రీను, పెద్దబ్బాయి, జానీతో పాటు మరో 10 కుటుంబాలకు చెందిన వారు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పీఆర్కే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు వారి అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని అన్ని గడపల్లో ఆనందం వ్యక్తమవుతోందని చెప్పారు. గ్రామానికి చెందిన సబ్బసాని కోటిరెడ్డి, మేడబోయిన కోటయ్య ఆధ్వర్యంలో వీరు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మార్చి 2న అర్బన్ పీహెచ్‌సీలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్స్, స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టును బుధవారం విడుదల చేస్తున్నామన్నారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే మెడికల్ ఆఫీసర్స్ ఏప్రిల్ 3లోగా, స్టాఫ్‌నర్సులు ఏప్రిల్ 5లోగా లిఖిత పూర్వకంగా తగు ధ్రువపత్రాలతో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

స్పెషలిస్టు వైద్యుల మెరిట్ లిస్టు

టెలిమెడిసిన్ హబ్‌లో స్పెషలిస్టు డాక్టర్స్, మెడికల్ ఆఫీసర్స్ ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరైన వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును బుధవారం విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు తెలిపారు. మెరిట్ లిస్టులో అభ్యంతరాలు ఉంటే ఏప్రిల్ 3తేదీ సాయంత్రం 4 గంటల్లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

పారామెడికల్ ఉద్యోగాల ప్రొవిజనల్ మెరిట్‌లిస్ట్

నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం ద్వారా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మార్చి2న పారామెడికల్ ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరైన వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును బుధవారం విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు తెలిపారు. మెడికల్ ఆఫీసర్, జనరల్ ఫిజీషియన్, డెంటల్ టెక్నీషియన్, సోషల్ వర్కర్, సైకాలజిస్టు, మల్టీరిహాబిలిటేషన్ వర్కర్, ఆడియో మెట్రీషియన్, న్యూట్రీషియన్ కౌన్సిలర్, ఫిజియోథెరపిస్టు, స్టాఫ్‌నర్సు, హాస్పిటల్ అటెండెంట్, శానిటరీ అటెండెంట్, అటెండర్, క్లీనర్, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

వినూత్న ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలి



సాంకేతిక సమ్మేళనం లోగోను ఆవిష్కరిస్తున్న అతిథులు

నరసరావుపేట ఈస్ట్: సమాజానికి ఉపయోగపడే వస్తుసేవల ఆవిష్కరణలపై ఇంజినీరింగ్ విద్యార్థులు దృష్టిపెట్టాలని జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ బి.బాలకృష్ణ తెలిపారు. జేఎన్‌టీయూ-ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మేక్సెల్-2023 జాతీయస్థాయి సాంకేతిక సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ బాలకృష్ణ మాట్లాడుతూ జేఎన్‌టీయూలో మెకానికల్ ఇంజినీరింగ్ చదివిన పూర్వ విద్యార్థులు నేడు పలు రంగాలలో ఉన్నతస్థానంలో ఉన్నారని తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకొని నేటితరం విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఎదగాలని ఆకాంక్షించారు. ఇంజినీరింగ్ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు డిజైన్ థింకింగ్ అలవరుచుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని సెల్‌ఫోన్ కాలక్షేపంతో వృథా చేసుకోరాదని హితవు పలికారు. సమయపాలన, క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక సమ్మేళనాలలో పాల్గొనటం ద్వారా నైపుణ్యాలను పెంచుకునేందుకు వీలుంటుందని తెలిపారు. మారుతున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. సమ్మేళనంలో ఎథికల్ హ్యాకింగ్, అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలపై వర్క్‌షాప్ నిర్వహించి విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సమ్మేళనం లోగోను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్ఫిగ్లోబ్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు శ్రీచైతన్య, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, మెకానికల్ విభాగాధిపతి ఎ.శ్రీవాణీసుష్మ, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు బాలాజీనాయక్, డాక్టర్ జి.సులోచన, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు ఉజ్వల్‌భరత్, శంకర్‌సూర్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిడమర్రులో మిర్చి టిక్కీల చోరీ

రైతులు అడ్డుకోవడంతో ద్విచక్ర వాహనం వదిలి పరారైన గుర్తు తెలియని వ్యక్తి

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు పంట పొలాల్లో ఆరబోసిన మిర్చిని గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బాధితుల కథనం ప్రకారం.. పలువురు రైతులు మిర్చి పంటను కోసి కల్లాల్లో ఆరబోశారు. అయితే రాత్రి వేళల్లో రైతులు కాపలాగా ఉన్నా అర్ధరాత్రి దాటిన తరువాత రైతులు నిద్రపోయిన సమయంలో గత నాలుగు రోజులుగా పలు కల్లాల్లో ఆరబోసిన మిర్చిని గోతాల్లోకి నింపుకుని దోచుకు వెళుతున్నారు. నిడమర్రుకు చెందిన తాడిబోయిన మోహనరావు పొలంలోని 16 టిక్కీల మిర్చిని, ఉయ్యూరు మధుసూదనరెడ్డికి చెందిన నాలుగు మిర్చి టిక్కీలతో పాటు మరో ఇద్దరు రైతులకు చెందిన మిర్చి టిక్కీలను గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. మంగళవారం రాత్రి కల్లాల్లో మిర్చిని దుండగులు టిక్కీలకు నింపి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా రైతులు గమనించి వెంబడించడంతో దుండగులు ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయారు. రైతులు బుధవారం మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనుబోతును చంపిన కేసులో నిందితుల అరెస్ట్



అదుపులోకి తీసుకున్న నిందితులతో ఫారెస్టు అధికారులు

మాచర్ల: మనుబోతును చంపి మాంసాన్ని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఫారెస్టు అధికారులు రాజశేఖర్, బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మాచర్ల ఫారెస్టు రేంజ్ పరిధిలోని మండాదికి సమీపంలో విద్యుత్ కనెక్షన్ పెట్టి పలువురు మనుబోతును చంపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఫారెస్ట్ అధికారులు బుధవారం శీలం కొండ, స్వామి నాయక్, రంగానాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు. మనుబోతును చంపి మాచర్ల పట్టణ శివారులో మాంసాన్ని విక్రయిస్తున్న వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా మరికొంత మంది ఉన్నారని తేలింది. వారు పరారీలో ఉండటంతో త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఈ ముఠాను ఫారెస్టు అధికారులు విచారిస్తున్నారు.

జంట హత్యల కేసులో నిందితుడికి యావజ్జీవం

గుంటూరు లీగల్: జంట హత్యల కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు ముద్దాయి కోనూరు శ్రీనివాస చక్రవర్తి బెల్లంకొండ మండలం నందిరాజుపాలెం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఫిర్యాది కోనూరు లక్ష్మీనారాయణ సత్తెనపల్లి పట్టణంలోని నాగార్జుననగర్‌లో నివాసం ఉంటున్నాడు. కోనూరు లక్ష్మీనారాయణ తండ్రి శివప్రసాదరావుకు సంబంధించిన పొలంలో తమకు వాటా ఉందని, తమ భాగం తమకు ఇవ్వాలని ముద్దాయి కోనూరు శ్రీనివాస చక్రవర్తి, ఫిర్యాది కోనూరు లక్ష్మీనారాయణతో తరచూ ఘర్షణ పడేవాడు. ఈ క్రమంలో 2021 ఆగస్టు 28న సాయంత్రం లక్ష్మీనారాయణ ఇంట్లో లేడని తెలుసుకుని శ్రీనివాస చక్రవర్తి ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న లక్ష్మీనారాయణ తల్లి కోనూరు పద్మావతి, చెల్లెలు మనప్రగడ ప్రత్యూషతో ఘర్షణకు దిగాడు. అనంతరం తన దగ్గర ఉన్న కత్తిని తీసి పద్మావతిని విచక్షణారహితంగా పొడిచాడు. అడ్డుకునేందుకు నాలుగు నెలల గర్భవతి అయిన ప్రత్యూష వెళ్లగా ఆమెను కూడా కత్తితో క్రూరంగా పొడిచాడు. దీంతో ఇద్దరూ మృతి చెందారు. తల్లి, చెల్లి హత్యపై లక్ష్మీనారాయణ సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు అనంతరం అప్పటి సీఐ యు.శోభన్‌బాబు ఛార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు విచారణలో సాక్ష్యాధారాలతో నేరం రుజువుకావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున జిల్లా కోర్టు పీపీ మహమ్మద్ సుల్తాన్ సిరాజుద్దీన్ వాదించారు.

అంగన్‌వాడీ పోస్టులకు పారదర్శకంగా ఇంటర్వ్యూలు

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

బాపట్ల: అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీ పోస్టుల భర్తీ కోసం పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. 10 ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లలో 13 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉండగా, 34 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అంగన్‌వాడీ ఆయాల పోస్టులు 86 ఖాళీగా ఉండగా 126 మంది ఇంటర్వ్యూకు వచ్చారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ పీడీ కె.ఉమా, ఆర్డీఓ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి రూ.9.21 లక్షల విరాళాలు



ఎమ్మెల్సీ జంగా, శివస్వామికి విరాళం అందజేస్తున్న కౌన్సిలర్ వెంకట్రామయ్య

దాచేపల్లి: గామాలపాడు గ్రామ సమీపంలో నాయకురాలు నాగమ్మ నిర్మించిన శివాలయం అభివృద్ధికి బుధవారం దాతలు రూ.9.21 లక్షల విరాళాలు ప్రకటించారు. ఈ దేవాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ రూ.50,116, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి రూ1,01,116, దాచేపల్లి నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య రూ.1,01,116, మాశెట్టి బుజ్జి, మాశెట్టి పుల్లారావు రూ.1,01,116, హైదరాబాద్‌కు చెందిన కోవిడ్ సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జి.అనూహ్యరెడ్డి రూ.1,01,116, సర్పంచ్ జంగా సురేష్ రూ.50,116, 13వ వార్డు కౌన్సిలర్లు వందనపు వెంకట్రామయ్య రూ.50,116, పిడుగురాళ్లకు చెందిన శ్రీనివాసరావు రూ.50,116, దాచేపల్లికి చెందిన కుందురు తిరుపతి రెడ్డి, పానాది వెంకటనారాయణ, ముత్యాలంపాడుకు చెందిన ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, గామాలపాడుకు చెందిన మంచి గురవారావు, పిడుగురాళ్లకు చెందిన రామకృష్ణ, ఇరికేపల్లికి చెందిన భాటివర్తి పకీరారెడ్డి ఒక్కొక్కరూ రూ.25 వేల చొప్పున కలిపి మొత్తం రూ.9.21 లక్షలు విరాళాలు ప్రకటించారు. రూ.25 లక్షలు విలువ చేసే మరకత లింగం తమ పీఠం ద్వారా తీసుకువస్తామని శివస్వామి చెప్పారు. శివాలయం జీర్ణోద్ధరణకు ప్రజలు సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

పదిహేనేళ్లు ముగిసిన ప్రభుత్వ వాహనాలకు చెల్లు

రోడ్డు సేఫ్టీ సమావేశంలో వెల్లడించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: ఏప్రిల్ 1వ తేదీ నుంచి 15 ఏళ్ల కాలపరిమితి ముగిసిన ప్రభుత్వ సంస్థల వాహనాలు రోడ్లపై తిరిగేందుకు వీలులేదని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ శివశంకర్ అధ్యక్షతన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాల చట్టంలో రూలు 52ను అమల్లోకి తెచ్చిందన్నారు. ఆ రూలు ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాహనాలు, మున్సిపల్ కార్పొరేషన్, ఆర్టీసీ వాహనాలు, పంచాయతీలకు సంబంధించిన వాహనాలు వేటికైతే పదిహేనేళ్ల కాలపరిమితి ముగుస్తుందో ఆ వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు అవుతుందన్నారు. యాక్సిడెంట్స్ డేటాను పరిశీలించి ప్రమాదల నివారణకు పలు సూచనలు చేశారు. గుర్తించిన బ్లాక్ స్పాట్లలో సంబంధిత విభాగాల అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్, రవాణా, నేషనల్ హైవేస్, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. చాలా ప్రదేశాల్లో రోడ్డు మార్కింగ్స్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని సమావేశంలో జిల్లా ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ టీకే పరంధామరెడ్డి తెలుపగా, తగు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

భూకబ్జాల నాని.. నోరు అదుపులో పెట్టుకో!



వివరాలు వెల్లడిస్తున్న కార్పొరేటర్ ఆదారి

పట్నంబజారు(గుంటూరు): టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోవెలమూడి రవీంద్రనాథ్ అలియాస్ భూకబ్జా నాని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌పై పిచ్చిపట్టిన వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని 32వ డివిజన్ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఈచంపాటి వెంకటకృష్ణ (ఆదారి) హెచ్చరించారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఎమ్మెల్యే గిరి కార్యాలయంలో బుధవారం పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదారి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే గిరికి టీడీపీ నేతలు ఫోన్ కాల్స్ చేశారని స్పష్టంగా నిరూపించటం జరిగిందన్నారు. టీడీపీ సెంట్రల్ కార్యాలయం నుంచి జనార్దన్ ఫోన్ చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 34వ డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత మాట్లాడుతూ కోవెలమూడి నాని అంటేనే అలియాస్ దందాలు..సెటిల్‌మెంట్‌లు, బంకు., భూకబ్జాలనే విషయం ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. కానీ రోడ్డులో భూకబ్జా, పేకాట క్లబ్ నిర్వహించటం, పెట్రోలు, డీజిల్ తగ్గించి వాహనాల్లో కొట్టించటం నానికి పరిపాటేనని విమర్శించారు. నియోజకవర్గంలో రూ.140 కోట్లతో అభివృద్ధి పనులు జరిగితే... రూ.3 కోట్లు డివిజన్ అభివృద్ధికి కేటాయించటం జరిగిందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలు జరిగినప్పుడు కళ్లు కనిపించకుండాపోయాయా అని విమర్శించారు. యూజీడీ పనులకు సంబంధించి రూ.400 కోట్లు కమిషన్లు టీడీపీ నేతలు గుంటూరును గుంతలమయంగా మార్చేస్తే.. వాటిని తిరిగి పూడ్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రెండేళ్లు పట్టిందన్నారు. చంద్రబాబుకు ఆత్మలాంటి వ్యక్తి జనార్దన్ ఫోన్ చేసింది సాక్ష్యాధారాలతో నిరూపించామని, అసలు ఆయన ఎమ్మెల్యే గిరికి ఎందుకు ఫోన్ చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. 28 డివిజన్ కార్పొరేటర్ రోషన్ మాట్లాడుతూ ప్రజల్లో కనీస విలువలు లేని వ్యక్తి కోవెలమూడి నాని అని, అటువంటి వ్యక్తి ఎమ్మెల్యే గిరిపై వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకట రమణ, తేలుకుట్ల యోగేశ్వరరావు, కె. గురవయ్య, సాధు ఉమామహేశ్వరి, అడకా పద్మావతి, ఆచ్చాల వెంకటరెడ్డి, అందుగుల సంతోష్, గోపి శ్రీనివాస్, ఉడుముల లక్ష్మి, షేక్ జమ్మాజీ, మార్కెట్‌బాబు, యక్కలూరి మారుతి, బోపాటి ఉషారాణి, మల్లిబోయిన శ్రీవల్లి, డివిజన్ ఇన్‌చార్జీలు టీఎల్‌వీ వీరాంజనేయులు, అనం సంజీవరెడ్డి, బోగినం ప్రసాద్, మందాల కోటిరెడ్డి పాల్గొన్నారు.